టమోటా ధరలు ఆశాజనకం



సోమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు పెరుగుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నెల రోజులుగా రూ. 200 నుంచి రూ. 300 లోపు పలికే 15కిలోల బాక్సు ఆదివారం రూ. 450కి చేరుకుంది.ఎండల తీవ్రతతో పాటు ఊజీ ఈగల దాడులతో, నల్లమచ్చలతో టమోటాకు తీవ్రంగా నష్టం జరిగింది.సగానికి సగం నల్ల మచ్చ, ఊజీ ఈగలతో దెబ్బతిన్న కాయలు వస్తుండడంతో వాటిని మార్కెట్లలో కొనడం లేదు. వీటిని పశువులకు మేతగా వేస్తున్నారు. ఇతర జిల్లాల్లో టమోటా సాగు తగ్గిపోవడంతో సోమల, పుంగనూరు, చౌడేపల్లె, పలమనేరు తదితర ప్రాంతాల్లో ఏప్రిల్, మే నెలల్లో నాట్లు వేసిన వారికి దిగుబడులు ప్రారంభమై లాభాలు వస్తున్నాయి. సోమల మండలంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో నాటిన తోటల్లో దిగుబడులుండీ ధరలు లేక పోవడంతో నష్టాలు వచ్చాయి. పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు దిగాలు పడ్డారు.ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు లేకపోవడంతో వ్యాపారస్తులు పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మార్కెట్లకు రావడంతో ఎగుమతులు పెరిగి ధరలు పుంజుకుంటయని రైతులు ఆశ పడుతున్నారు.ఇప్పటికే కోలారు, వడ్డిపల్లె, మొలకలచెరువు, అంగళ్లు తదితర టమోటా మార్కెట్లలో 30కిలోల బాక్సు రూ.900కు మించి ధర పలుకుతోంది.

బోయకొండ కిటకిట

చౌడేపల్లె, జూలై20(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం కిటకిటలాడింది.గంగమ్మకు ప్రీతి కరమైన ఆషాడ మాసం చివరి ఆదివారం కావటంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావటంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టికెట్ల ద్వారా అమ్మవారికి రూ.22 లక్షల ఆదాయం చేకూరిందని ఈవో ఏకాంబరం తెలిపారు.కాగా మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి కీర్తన కుటుంబ సభ్యులతో గంగమ్మను దర్శించుకున్నారు.






ప్రత్యేకాలంకారంలో గంగమ్మ - క్యూలైన్లలో వేచివున్న భక్తులు

మాజీ వైస్ ఎంపీపీ దారుణ హత్య

పోలీసుల అదుపులో అనుమానితులు



రంగయ్య నాయుడు (ఫైల్‌ఫొటో)

తవణంపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకుడు తెల్లగుండ్లపల్లె రంగయ్యనాయుడు శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 15 సంవత్సరాల క్రితం తవణంపల్లె మండల ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రంగయ్యనాయుడు ప్రస్తుతం స్వగ్రామం తెల్లగుండ్లపల్లెలో భార్యతో కలిసి ఉంటున్నాడు. భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాదులోని కుమారుడు వద్దకు వెళ్లింది. దీంతో కుమార్తె, అల్లుడు.. రంగయ్యనాయుడికి తోడుగా ఉంటున్నారు. శనివారం రాత్రి భోజనం చేశాక ముగ్గురూ ఇంట్లోనే నిద్రించారు. ఆదివారం వేకువజామున సుమారు 5.45 గంటలకు ఇంటి ముందున్న ట్రాక్టరు షెడ్డుకు కాళ్లు, చేతులు కట్టేసి ఉరేసి ఉండటాన్ని పక్కింటివారు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబీకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ సాయినాథ్, రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చిత్తూరు నుంచి జాగిలాలు, క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా, గ్రామంలో కొంతమంది యువకులతో జరిగిన చిన్నపాటి గొడవలే ఈ హత్యకు కారణమన్న ఆరోపణలతో కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏపీపీఎస్సీ పరీక్షలకు 234మంది హాజరు





సీతమ్స్ కళాశాల వద్ద అభ్యర్థులు, తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో లెక్చరర్ల నియామక పోటీపరీక్షలు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఆదివారం పకడ్బందీగా జరిగాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పద్ధతిలో ఏపీపీఎస్సీ ద్వారా ఈ పరీక్షలు జరిగాయి. కో-ఆర్డినేటర్‌గా డీఆర్వో మోహన్‌కుమార్ వ్యవహరించారు. ఏపీపీఎస్సీ ప్రతినిధి చంద్రారావు నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 660 మంది అభ్యర్థులకుగాను 234 మంది హాజరవగా, 426 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

కుప్పంలో 'సూర్య' వెలుగులు!

- నడిమూరు సూర్యఘర్ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం
- టెండర్ల దశలో ఎస్సీ, ఎస్టీ, వ్యవసాయ ఉచిత సర్వీసులు
- వెనుకబడిన కులాలకు రూ.20 వేల సబ్సిడీ

కుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అనతికాలంలోనే కుప్పం సోలార్ వెలుగులతో నిండిపోనుంది. నడిమూరులో నమూనాగా చేపట్టిన సూర్యఘర్ సోలార్ ప్రాజెక్ట్ విజయవంతమైన నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా సోలార్ సర్వీసులు ఇవ్వడానికి ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రెస్కో కసరత్తు చేస్తోంది. సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలన్న సత్సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోంది. ఇందులో ప్రధానంగా సంప్రదాయ విద్యుత్తుకు బదులుగా సూర్యశక్తి (సోలార్ ఎనర్జీని) ముందుకు తీసుకొచ్చింది. ఈ క్రమంలో సొంత నియోజకవర్గమైన కుప్పంనుంచి సోలార్ విద్యుత్తును వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన సూర్యఘర్ అందుకు అనువుగా రంగంమీదకు వచ్చింది. దీంతో కుప్పం మండలం నడిమూరు వద్ద సోలార్ విద్యుత్తు ప్రాజెక్ట్‌ను ఈ ఏడాది జనవరి 6వ తేదీన చంద్రబాబు ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. గ్రామాన్ని పూర్తిగా సోలార్ విద్యుత్తు కనెక్షన్లమయం చేయడానికి ఎస్పీడీసీఎల్ సహకారంతో కుప్పం రెస్కో ముందుకొచ్చింది. గ్రామంలోని వంద ఇళ్లకు సోలార్ ప్యానెల్స్‌ను అమర్చడం ద్వారా నడిమూరు పైలెట్ ప్రాజెక్ట్‌ను అధికారులు విజయవంతం చేశారు.



సోలార్ ప్యానెల్స్‌తో నిండిన నడిమూరు

ఇదే ఊపులో నియోజకవర్గంలో గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వ్యవసాయ కనెక్షన్లను సోలార్ విద్యుత్తుమయం చేయడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్తును అందించనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7,489 ఎస్సీ, ఎస్టీ సర్వీసులున్నట్లు గుర్తించి వాటన్నింటికీ సోలార్ విద్యుత్తు సర్వీసులు ఇవ్వడానికి టెండర్లను పిలిచారు.అలాగే నాలుగు మండలాల్లో వ్యవసాయానికి సంబంధించి 126 రూరల్ ఫీడర్ల పరిధిలో 34 వేల సర్వీసులున్నట్లు తేల్చి, వీటికి కూడా టెండర్లను ఆహ్వానించారు. ఈ రెండురకాల సర్వీసులు పోనూ బీసీలు, ఓబీసీలు, ఓసీలకు సంబంధించి 43 వేల సర్వీసులు మిగిలాయి. వీటికి కూడా నిర్దేశిత ధరలను నిర్ణయించి సోలార్ విద్యుత్తు సర్వీసులు ఇవ్వడానికి అధికార యంత్రాంగం శ్రమిస్తోంది.

సబ్సిడీలు, రుణాలతో ప్రోత్సాహం

సోలార్ విద్యుత్తు కనెక్షన్ ఇటు వినియోగదారుడికి అటు సర్వీసు ఇచ్చిన రెస్కోకు ఖర్చులు తగ్గించి, లాభాలు చూపిస్తుందని అధికారులు చెబుతున్నారు. సోలార్ సర్వీసు తీసుకున్న వారికి టూ వే మీటర్లు ఏర్పాటు చేస్తారు. ఇంటి మీద అమర్చే సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్తు ఇంటి అవసరాలకు సరిపోగా, మిగిలిన విద్యుత్తు ఇదే మీటర్ ద్వారా వెనక్కు, అంటే రెస్కోకు వెళ్తుంది. ఇలా తాము తీసుకున్న విద్యుత్తుకు సరిపడా ధరను, నెలవారీ బిల్లుల్లో తగ్గించి ఇస్తారు. అంటే ఆమేరకు వినియోగదారుడికి లాభం చేకూరుతుందన్న మాట. ఉదాహరణకు ఒక కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఇన్ని యూనిట్ల సంప్రదాయ విద్యుత్తు వాడితే వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్న బిల్లు రూ.1000. అయితే సోలార్ విద్యుత్తు సర్వీసు తీసుకుంటే ఈ బిల్లు మొత్తం రూ.338కి తగ్గి, వినియోగదారుడికి మొదటి ఏడాది రూ.8 వేలు ఆదా అవుతుంది. నడిమూరు పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా 15 వేల యూనిట్ల విద్యుత్తు తిరిగి రెస్కోకే చేరుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అంటే సోలార్ విద్యుత్తు సర్వీసులు తీసుకున్న ఆ గ్రామ వినియోగదారులకు అంతమేరకు బిల్లుల్లో ధరలు తగ్గుతాయన్నమాట. అయితే సోలార్ విద్యుత్తు సరఫరాకోసం ఇంటిపైన ఏర్పాటు చేసే (రూఫ్ టాప్) సోలార్ ప్యానెల్స్ ధరలు కొంత అధికంగా ఉండడంతో ఒకేసారి అంత మొత్తం చెల్లించలేమన్న భావనలో నియోజకవర్గ ప్రజలు ఈ సర్వీసులు తీసుకోవడానికి వెనకాడుతున్నారు. ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్తుకు రూ.70 వేలు, 2 కిలోవాట్లకు రూ.1.40 లక్షలు, 3 కిలోవాట్లకు రూ.2.10 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారు. ఇందులో మొదటి రకానికి రూ.30 వేలు, రెండవ రకానికి రూ.60 వేలు, మూడవ రకానికి రూ.78 వేలు ప్రభుత్వ రాయితీ ఇస్తుంది. అంతేకాదు.. సబ్సిడీపోను, వినియోగదారుడు చెల్లించాల్సిన ధర మొత్తాన్ని వెలుగు ప్రాజెక్ట్ ద్వారా రుణాల రూపంలో ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఉదాహరణకు ఒక కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్ టాప్‌కు ప్రభుత్వ సబ్సిడీ పోను రూ.40 వేలు వినియోగదారు చెల్లించాల్సి ఉంటుంది. ఈ 40 వేలలో రూ.20 వేలు బ్యాంకు రుణం ద్వారా, మిగిలిన రూ.20 వేలు వెలుగు మహిళా రుణాల ద్వారా పంపిణీ చేస్తారు. ఈ మొత్తాన్ని నెలవారీ కంతుల రూపంలో వినియోగదారులు చెల్లిస్తే సరిపోతుంది. ఇదికాక బీసీ వినియోగదారులకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించింది.

వెలుగు ప్రాజెక్ట్ ద్వారా అంగీకార పత్రాలు

సోలార్ విద్యుత్తు సర్వీసులకోసం నియోజకవర్గంలోని గృహాలకు సంబంధించి ప్రజలనుంచి అంగీకార పత్రాలు తీసుకునే ప్రక్రియ ప్రస్తుతం నాలుగు మండలాల్లో నడుస్తోంది.వెలుగు ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 5661 మహిళా స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, 56,585 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో మండలానికి 600 ఇళ్లకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకోసం అంగీకార పత్రాలు తీసుకోవడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా విధించింది. ప్రతి మండలమూ ఈ లక్ష్యంలో దాదాపు 50 శాతం పూర్తి చేసింది. గ్రామాలు తిరుగుతున్న వీవో లీడర్లు, సీసీలు ప్రజలకు సోలార్ విద్యుత్తుపై అవగాహన కల్పించి సర్వీసులు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

సోలార్ విద్యుత్తుతో వినియోగదారుడికి ఎంతో మేలు



సోలార్ విద్యుత్తు పర్యావరణ హితమే కాక, వినియోగదారుడికి కూడా విద్యుత్తు బిల్లులు ఆదా చేస్తుంది. సామాన్య వినియోగదారునికి ఏడాదికి రూ.8 వేలదాకా బిల్లుల ఖర్చు మిగులుస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రుణాల సౌకర్యాలు వినియోగించుకుని వినియోగదారులంతా సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవాలి.కుప్పం నియోజకవర్గం మొత్తాన్ని సోలార్ విద్యుత్తుమయం చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాన్ని వీలైనంత త్వరలో నెరవేర్చడానికి కృషి చేస్తున్నాం.

- సోమశేఖర్, రెస్కో ఎండీ

హరోం.. హర

● విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తులు





ప్రత్యేక అలంకారంలో శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి - క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): హరోం హర అంటూ భక్తులు విజ్ఞానగిరికి పోటెత్తారు. పసుపు దుస్తులతో కావళ్లు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా కుమారస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. నారద పుష్కరిణి వద్ద రాత్రి 8.30గంటల వరకు సుమారు 8,500 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఇక 2,700మంది స్వామికి కావళ్లు సమర్పించారన్నారు. ఆడికృత్తిక సందర్భంగా ఉదయం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఇంద్రవిమానంపై పురవిహారం చేశారు.

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటామన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

12 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 12 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. పాలసముద్రంలో 16.2, కుప్పంలో 8.2, పెనుమూరులో 7.4, వి.కోటలో 6.8, గుడుపల్లెలో 3.6, నగరిలో 3.4, శాంతిపురంలో 3.2, రామకుప్పం, చిత్తూరు రూరల్‌లో 3, బైరెడ్డిపల్లెలో 2.2, శ్రీరంగరాజపురంలో 1.4, పుంగనూరులో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి



తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ఎలుగుబంటి కలకలం సృష్టించింది. రెండో మలుపు సమీపానికి ఎలుగుబంటి వచ్చింది. రోడ్డుపైకి వస్తుందేమో అని వాహనదారులు భయాందోళనకు గురయ్యాయి. కొన్ని నిమిషాల పాటు సమీపంలోనే తిరిగిన ఆ ఎలుగుబంటి తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది.

చెవిరెడ్డి చుట్టూ తుడా ఉచ్చు



4300 పేజీల నివేదిక అందజేసిన విజిలెన్స్

పక్కాగా ఫొటోలు, ఆధారాలు

ప్రభుత్వ ఆదేశాలతో కేసు నమోదుకు అవకాశం

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న తుడా మాజీ చైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చుట్టూ తుడా ఉచ్చు బిగుసుకుంటోంది. తుడాలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు అధికారులు ప్రభుత్వానికి దాదాపు 4300 పేజీల నివేదికను పంపారు. దీంతో ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిన పరిస్థితి చెవిరెడ్డికీ, అప్పటి తుడా అధికారులకూ ఎదురైంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు రూ.380 కోట్ల పైచిలుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా ఖర్చు చేసినట్లు విజిలెన్సు నివేదికలో పొందుపరిచారు. ఇందులో ఎక్కువ శాతం నిధులు సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. చివరకు తెలంగాణ ఎన్నికల సమయంలోనూ పొలిటికల్ సర్వే కోసం తుడా డబ్బును వాడినట్లుగా అధికారులు గుర్తించారు. తుడా నిధులు దాదాపు 90 శాతం వరకు చంద్రగిరి నియోజకవర్గంలోని పనులకు మళ్లించారు. ఇలా చేయడం నేరమని అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇక చెవిరెడ్డి సొంత ఊరైన తుమ్మలగుంట ట్యాంక్ ఆధునికీకరణ పేరుతో కోట్లు దుర్వినియోగం అయిందనీ, ప్రజాధనంతో బెంచీలు ఏర్పాటు చేసి వాటిపై వారి పేర్లు రాసుకున్నారనీ, తుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు వ్యక్తిగత పర్యటనలకు కూడా తుడా డబ్బులే ఖర్చు చేశారనీ అధికారుల నివేదికలో పొందుపరిచారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలకు అనధికారికంగా పనులు, బడ్జెట్ కేటాయించినట్లు చూపించారు. ఆ నిధులను వ్యక్తిగత ఖాతాలో జమచేశారు. అలాగే చెవిరెడ్డి కుటుంబానికి చెందిన సీఎంఆర్ కంపెనీనే చాలా కాంట్రాక్టు పనులు చేపట్టింది. మొత్తంగా చెవిరెడ్డి కుటుంబం తుడా నుంచి భారీగానే నిధులు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్సు తేల్చింది. అయితే చైర్మన్‌కు సంతకం చేసే అధికారం లేదని, తనకేం తెలియదని చెవిరెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. దీనిద్వారా తన మాటవిని సంతకాలు పెట్టిన అధికారుల మెడకు కూడా ఉచ్చు బిగుసుకునేలా చేశారాయన. తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్సు విచారణలో గుర్తించిన అంశాలను బట్టి ఆయన తప్పించుకోలేరని అధికారుల వాదన. దీంతో లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలులో ఉన్న చెవిరెడ్డి మెడకు తుడా నిధుల దుర్వినియోగం కేసు కూడా చుట్టుకున్నట్టే అంటున్నారు.





అడవి పూసిన అందాలు

వానలు కురుస్తున్నాయి. చినుకు తడి తగిలిన చెట్టూచేమా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నేల రాలిన ఎండుటాకులు మట్టిలో మగ్గిన కమ్మటి వాసన అడివంతా పరచుకుంటోంది. ప్రకృతి కొత్త జీవులకు పురుడుపోస్తోంది. వాన వెలిసి ఎండపొడ పడినతావుల్లోంచి వెచ్చని ఆవిరి పొగలా పైకి లేస్తోంది. అడవిపూలను వెతుక్కుంటూ రంగురంగుల సీతాకోకచిలుకలు తిరుగుతున్నాయి. నేల పిగిలినట్టుగా, చెట్లు పూసినట్టుగా ఎటు చూసినా సీతాకోకచిలుకల గుంపులు తిరుమల అడవుల్లో కనువిందు చేస్తున్నాయి. శేషాచలం కొండల్లో దాదాపుగా 106 జాతుల సీతాకోకచిలుకలు ఉన్నట్టు ఒక అంచనా. అయితే కేవలం 5 కుటుంబాలకు చెందిన 50 జాతులనే ఇప్పటిదాకా వివిధ అధ్యయనాల్లో గుర్తించారు. తిరుమలతో పాటూ తలకోన, మామండూరు, బాలపల్లి, దివ్యారామం ప్రాంతాల్లో సీతాకోకచిలుకలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నల్లటి రెక్కలమీద ఎర్రటి మచ్చలుండే కామన్‌రోజ్, నలుపుతో పోటీపడే గాఢ నీలిరంగు మచ్చల బ్లూటైగర్, లేత, గాఢ పసుపు రంగు పూసినట్టుగా ఉండే లెమన్ ఎమిగ్రెంట్ రకాలు తిరుమల అడవుల్లో అత్యధికంగా కనిపిస్తున్నాయి. నిజానికి వీటి జీవితకాలం రెండు నెలలలోపే అయినా ప్రకృతి ధర్మాన్ని నెరవేర్చడానికి సంబరంగా సందడిగా ఎగురుతూ వాలుతూ అడవంతా అందాలు పంచుతున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'మద్దతు ధర' ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలి

● మామిడి రైతుల సంక్షేమ సంఘం



రైతులతో సమావేశమైన మామిడి సంక్షేమ సంఘం నేతలు

చిత్తూరు సెంట్రల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగా తోతాపురి మామిడికి మద్దతు ధర ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం చిత్తూరు కమిటీ తీర్మానించింది. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో సంఘ కన్వీనర్ జనార్ధన్ అధ్యక్షతన మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆనందనాయుడు, మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తోతాపురి మామిడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఇందులో ప్రభుత్వం నుంచి రూ.4 సబ్సిడీపోను, ర్యాంపులు, ఫ్యాక్టరీలవారు రూ.8చెల్లించాలన్నారు. జిల్లాలోని 50వేల మంది రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించని వారిపై సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో మామిడి దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు హరిబాబు, సంజీవరెడ్డి, లవకుమార్, ఓబుల్‌రాజు, మునిరత్నం నాయుడు, చంద్రమౌళి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగాకు కోసం వెళ్లి..

● విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి



లోకేష్ నాయుడు (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మునగాకు కోసం వెళ్లి విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త ఒకరు మృతి చెందారు. హెడ్‌కానిస్టేబుల్ దాము తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరుకు చెందిన వరదరాజులునాయుడు కుమారుడు లోకేష్ నాయుడు (36) ఆదివారం మధ్యాహ్నం ఆడికృత్తిక సందర్భంగా మునగాకు కోసం వెళ్లాడు. గ్రామానికి సమీపంలోని మునగాకు చెట్టు వద్దకెళ్లి, కొమ్మను వంచగా అది విరిగి పక్కనున్న తీగలపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన బంధువులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అత్యాచారంపై కేసు నమోదు

కల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఓ యువతి (22)పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తన మాట వినకుంటే తండ్రిని చంపేస్తానని బెదిరించి బాధితురాలిని నిందితుడు (55) లొంగదీసుకున్నాడన్నారు. అతడి ఆగడాలు రాన్రానూ శ్రుతి మించడంతో ఆ యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దేవళంపేటలో పంటలపై గజదాడులు



ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో వారం క్రితం వరకు మామిడి పంటకు నష్టం కలిగిస్తున్న ఏనుగుల గుంపు మామిడిచెట్లపై కన్నెర్ర చేస్తున్నాయి. మామిడి చెట్ల కొమ్మలను విరిచేస్తూ పలు చెట్లను కూకటి వేళ్లతో పెకలిస్తున్న ఏనుగులు హంగామా సృష్టిస్తున్నాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి శనివారం రాత్రి బయలు దేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు శంకర్‌కు చెందిన 15 మామిడి చెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. మరో రైతు శివయ్యకు చెందిన వేరు శనగ పంటను తొక్కేసిన ఏనుగులు పశుగ్రాసాన్ని తినేశాయి. రైతు నరసింహులుకు చెందిన వంకాయ చెట్లు, పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. వీకే పల్లిలోని రైతు దూర్వాసులు నాయుడుకు చెందిన మామిడిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. కుమ్మరిపల్లిలోని రైతు ధనంజయ నాయుడుకు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడి నుంచి సమీపంలోని అడవిలోకి ఏనుగులు చేరుకున్నాయి. ఆదివారం పగలంతా చింతలవంక వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయండి

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్



సమావేశంలో ప్రసంగిస్తున్న రామ్మూర్తి

చిత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయం చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తి అధ్యక్షతన ఆదివారం చిత్తూరులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుమన్, మధుబాబుతో కలిసి రామ్మూర్తి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు ఎంతో మేలు జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ఆప్కాస్‌లో ఉన్న చిన్న లోపాలను సరిదిద్దాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో 11వ పీఆర్సీ కమిటీ, సీఎస్ కమిటీ 30శాతం వేతనాలు పెంచాలని సిఫార్సు చేస్తే, కేవలం 23 శాతం మాత్రమే పెంచి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఏపీజేఏసీ అమరావతి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ రాష్ట్ర నాయకుడు మురళీధర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్‌కుమార్, చంద్రశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామభద్ర, తిరుపతి జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా, అధిక సంఖ్యలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి, అధ్యాపకులు

వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఆదివారం ఎనిమిది మంది డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ దామోదరరావు, అధ్యాపకులు నాగరాజునాయక్, దశరథుడు, మునికృష్ణ, సూపరింటెండెంట్ కృపావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో నింగి నుంచీ నిఘా



సీఎం పర్యటనలో వాడిన డ్రోన్

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం నాటి తిరుపతి పర్యటనలో పోలీసులు నింగి నుంచీ నిఘా పెట్టారు. తొలిసారిగా అత్యాధునిక టెథర్డ్ డ్రోన్ కెమెరాతో పాటు మరో 10 డ్రోన్లను వినియోగించారు. ఈ టెథర్డ్ డ్రోన్ కెమెరా ఐదు కిలోమీటర్ల పరిధి వరకు కవర్ చేస్తుంది. తూకివాకంలో రెండు, కపిలతీర్థంలో రెండు, పోలీసు పరేడ్ మైదానంలో మూడు చొప్పున డ్రోన్లు వాడారు. ఈ డ్రోన్ కెమెరాలకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉందని తిరుపతి సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ చెప్పారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంపై జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధన రాజు ధన్యవాదాలు తెలిపారన్నారు.

వెటర్నరీ వర్సిటీకి ఈ ఏడాదీ 'బీ ప్లస్'నే

తిరుపతిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి న్యాక్ బీప్లస్ గ్రేడ్ లభించింది. దేశంలోని వెటర్నరీ వర్సిటీలలో తొలిసారిగా గతేడాది ఎస్వీ వెటర్నరీ వర్సిటీ న్యాక్ గుర్తింపు పొందింది. ఈ ఏడాది కూడా బీప్లస్ గ్రేడ్ హోదాకే పరిమితమైంది. వర్సిటీలో ఈనెల 9వ తేది నుంచి మూడు రోజులపాటు హైబ్రిడ్ విధానంలో న్యాక్‌పీర్ టీమ్ సందర్శించింది. వర్సిటీలోని వివిధ డిపార్టుమెంట్లు, లేబొరేటరీలు, పరిశోధనా స్థానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర వాటిని ఇద్దరు సభ్యులు నేరుగాను.. మరో ఇద్దరు న్యాక్ హెడ్‌కేంద్రం నుంచి ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. కరిక్యులర్ యాస్పెక్ట్స్, టీచింగ్-లెర్నింగ్ అండ్ ఇవాల్యుయేషన్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్ అండ్ ఎక్స్‌టెన్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లెర్నింగ్ రిసోర్సెస్, స్టూడెంట్ సపోర్ట్ అండ్ ప్రొగ్రెషన్, గవర్నెన్స్, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ వాల్యూస్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ తదితర అంశాల గ్రేడింగ్ ప్రాతిపదికన బీప్లస్‌గ్రేడ్‌ని ఇచ్చారని సమాచారం.

కుటుంబీకులకు తప్పిపోయిన పిల్లల అప్పగింత



పిల్లలను నాన్నమ్మకు అప్పగించిన సీఐ మహేశ్వర

చిత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. సీఐ మహేశ్వర తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని సంతపేటకు చెందిన ధనరాజ్ తన పిల్లలైన యస్మిత(7), తనుశ్రీ(5)లను జింకలపార్కులో ఆడుకోవడానికి ఆదివారం తీసుకెళ్లాడు. పిల్లలు పార్కులో ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చేశారు. తండ్రి కనిపించక పోవడంతో ఏడుస్తున్నారు. వీరిని ఆ దారిలో వెళుతుండిన కట్టమంచికి చెందిన అక్కా, తమ్ముడు గుణశ్రీ, భరత్‌రాజ్ గమనించారు. పిల్లలు తప్పిపోయారని అర్థం చేసుకుని.. వారిని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సీఐ ఆ పిల్లలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. వారి నాన్నమ్మ ఇంద్రాణికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. అనంతరం ఆమె స్టేషన్‌కు రాగా పిల్లల్ని అప్పగించారు. తప్పిపోయిన పిల్లల్ని స్టేషన్‌కు తీసుకొచ్చిన భరత్‌రాజ్, గుణశ్రీలను సీఐ అభినందించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం

చిత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. చిత్తూరు నగరంలోని వినాయకపురానికి చెందిన లత ప్రైవేటు జాబ్ చేస్తుంది. ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని స్నేహితులు చెప్పడంతో రూ.1.40 లక్షలను సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా వెచ్చించింది. ఆ తర్వాత వారికి ఫోన్‌చేసినా.. మెయిల్ చేసినా సమాధానం రాలేదు. మోసపోయానని అర్థమవడంతో ఆదివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకతతో ముందుకు సాగండి

● కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి
● తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవంలో క్రియా వర్సిటీ చాన్సలర్ సూచన



పట్టాలందుకున్న ఐఐటీ విద్యార్థులు

ఏర్పేడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, సృజనాత్మకతతో ముందుకు సాగాలంటూ విద్యార్థులకు క్రియా యూనివర్సిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్ సూచించారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం జరిగిన 7వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎల్‌ఈజీవో వ్యవస్థాపకుడు ఓలే కిర్క్ క్రిస్టియన్సన్ జీవితాన్ని ఉదహరించిన ఆయన.. కష్టాలను ఎదుర్కొంటూ ఎలా గొప్ప విజయాలను సాధించవచ్చో వివరించారు. అదే తరహాలో కృషి పట్టుదలతో కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, స్టార్టప్ పిక్సెల్స్ గురించి వివరించారు. హైపర్ స్పెక్ట్రల్, ఇమేజింగ్ అనే సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం, మైనింగ్, పర్యావరణం వంటి రంగాల్లో డేటా ఇవ్వడానికి ఉపగ్రహాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా డ్రోన్ ఆధారిత పరిష్కారాలపై పరిశోధనలు జరుగుతుండటాన్ని గుర్తించాలన్నారు. చుట్టూ ఉన్న ప్రపంచం వేగంగా మారిపోతోందని, ప్రతి రంగంలో కనిపిస్తున్న కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. 'మీ కథలను మీరే రాయండి. వాటిలో మీరే హీరోలుగా ఉండండి' అంటూ సలహా ఇచ్చారు.

పట్టుదలతోనే వికసిత్ భారత్

వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే విద్యార్థులకు కృషి, పట్టుదల అవసరమని బోర్డు ఆఫ్ గవర్నర్ చైర్మన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఎండీ సజ్జన్ జిందాల్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ, సైన్స్ రంగంలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై దృష్టిపెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న క్వాంటం వ్యాలీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతాన్ని టెక్నాలజీ స్ట్రాటజిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాయని తెలిపారు. తిరుపతి ఐఐటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. కొన్నేళ్లుగా అధ్యాపకులు నిర్వహించిన విద్యా కార్యకలాపాలు, పరిశోధనలను వివరించారు. ఈ ఏడాదిలో కోర్సులు పూర్తి చేసుకున్న 417మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు.

18 మందికి అవార్డులు

ప్రత్యేక ప్రతిభ కనబరచిన 18మంది విద్యార్థులకు వివిధ రకాల అవార్డులను ముఖ్య అతిథులు లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రదానం చేశారు. అరవింద్ శ్రీనివాసన్‌కు ప్రెసిడెంట్ అవార్డు, మేఘవర్షిణికి గవర్నర్స్ ప్రైజ్, షేక్ మహ్మద్ అల్లాబక్ష్‌కు మొదటి డీన్స్ ప్రైజ్, పి.కుమార్‌మిశ్రాకు ఇన్‌స్టిట్యూట్ ప్రైజ్, మేఘవర్షిణికి కమటం కృష్ణయ్య అవార్డు, కొత్తపల్లి ఈశ్వర్ వెంకటసాయివర్మకు అసోసియేట్ ప్రైజ్, అరవింద్ శ్రీనివాసన్, కలం మదన్‌మోహన్, జైదీప్ రాయ, రితిక్‌మండల్, ఆదిత్యన్, గౌరవ్ త్రిపతికు ఇనిస్టిట్యూట్ ప్రైజ్, సుధాకర్ వెంకటాచలానికి అమరరాజా ప్రైజ్, శ్రుతికి ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్, ఆకాశకు ప్రొఫెసర్ శ్రీనివాసన్ నటరాజన్ అవార్డు, అన్నయ్ మండల్‌కు ఆకురత్తి కుమారస్వామి సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్, చిరంజీవికి రామకృష్ణన్ ప్రైజ్ లభించాయి.

ప్రెసిడెంట్ అవార్డు రావడం ఆనందంగా ఉంది

417 మందిలో నాకు ప్రెసిడెంట్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల కలలు నిజం చేసిన రోజు వచ్చిందని ఆనందంగా ఉంది.

- అరవింద్ శ్రీనివాసన్

పట్టుదల, కృషితోనే సాధ్యం



పట్టుదల, కృషి, అధ్యాపకుల సహకారంతో గవర్నర్ ప్రైజ్ అందుకున్నా. దీంతో కృషితో దేన్నయినా సాధించవచ్చని నిరూపణ అయింది. వందమందిలో ప్రత్యేకంగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

- ఎం.మేఘవర్షిణి

ఉచిత కంటి ఆపరేషన్లకు 59 మంది ఎంపిక



కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసిన వృద్ధులతో జగదీశ్‌బాబు, వైద్య సిబ్బంది

కుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శారద కంటి ఆస్పత్రి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 59 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరు శారద కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది రాజేశ్, లావణ్య, నేత్ర, మటార్లపల్లె వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకే టీడీపీలో గుర్తింపు



రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు టీడీపీలో గుర్తింపు, పదవులు వస్తాయని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటి వద్ద పుంగనూరు, చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డిని కలిసి మండలాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంపై చర్చించారు. ఈనెలాఖరుకు వంద శాతం పూర్తి చేసి ప్రజల నుంచి వచ్చిన సమస్యలు తెలుసుకోవాలన్నారు. అనంతరం పుంగనూరు నూతన ఏఎంసీ చైర్మన్ నల్లబాల శమీపతి చల్లా రామచంద్రారెడ్డికి శాలువకప్పి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పుంగనూరు పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీరెడ్డి, గిరి, శ్రీకాంత్, చౌడేపల్లి, రొంపిచెర్ల టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఉయ్యాల రమణ, నాయకులు రఘునాథ్, చెంగల్‌రెడ్డి, మహేష్, ధనంజయనాయుడు పాల్గొన్నారు.

రోడ్డంతా వర్షపునీరు..!



రామసముద్రం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

పుంగనూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- రామసముద్రం మార్గంలోని ఎన్‌ఎస్‌పేటలోని ఈద్గ వద్ద వర్షపునీరు చెరువును తలపించే విధంగా రోడ్డుపై నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఈ మార్గంలో ప్రభుత్వాస్పత్రి ఉండటంతో రోగులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షపునీరు తొలగించడానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నా ప్రయోజనం లేదని స్థానికులు వాపోయారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్మన్ శమీపతి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానించిన ఏఎంసీ చైర్మన్ శమీపతి

పుంగనూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శమీపతి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రరెడ్డితో కలిసి పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లి మంత్రి స్వగృహంలో కలిశారు. పుంగనూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవిరెడ్డి, పోలీసుగిరి, శ్రీకాంత్, వెంకటముని, కృష్ణానాయక్, సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ,ఇబ్రహీం, రామకృష్ణానాయక్, మోహన్‌రెడ్డి, గంగధర్, ప్రసాద్ స్వామి, చైతన్య రాయల్, కోలాట వెంకటరమణ, గంగులప్ప పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ నాయకులు క్షమాపణ చెప్పాలి



ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై ఆరోపణలు చేసిన ఎస్‌డీపీఐ నాయకులు 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని పుంగనూరు బీజేపీ నాయకులు డిమాండు చేశారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎస్‌డీపీఐ నాయకుల మాటలను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో నరేంద్రమోదీ పాలనను అభినందిస్తుంటే ఎస్‌డీపీఐ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. భారతదేశంలోకి ఇతర దేశాల ప్రజలు రావాలంటే ప్రభుత్వ అనుమతులతో రావాలని, అక్రమ మార్గంలో దేశంలోకి ప్రవేశిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే అస్సాం రాష్ట్రం నుంచి వలస వచ్చి అటవీప్రాంతంలో నివాసం ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఎస్‌డీపీఐ నాయకులు నిజాలు తెలుసుకుని 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని.. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన, ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. నాయకులు డిష్ రాజారెడ్డి, జగదీష్‌రాజు, ప్రసాద్, పెద్దమఠం బాబు, వెంకటరెడ్డి, చంద్రరాజు, నాగరాజు, మణిమొదలియార్, వెంకటేష్, ఉమాశంకర్, శ్రీనా, రమేష్, హర్షవర్ధన్‌రాజు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే సహకార సంఘాలు

● ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు ఉన్నాయని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన నగరి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈక్రమంలోనే బాలాజీకి చైర్మన్ పదవి, జవహర్‌రెడ్డి, ఐ.వీ.నాయుడికి డైరెక్టర్ల పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాలకు నాయకులు పుష్పాంజలి సమర్పించారు. చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నేతలు రమేష్‌బాబు, కృష్ణారెడ్డి, మీరా,గుణశేఖర్, జ్యోతినాయుడు, సురేష్‌నాయుడు, వేణు, శ్రీనివాసులురెడ్డి, దశరథవాసు, కుమార్‌నాయుడు, ఎంపీ శ్రీనివాసులు, నారాయణస్వామి నాయుడు, శివకుమార్‌రెడ్డి, పరంధామనాయుడు, శ్రీనివాసన్, బాబునాయుడు, ధనంజయరాజు పాల్గొన్నారు.

సోమలలో వీధికుక్కల బెడద

సోమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోజురోజుకూ కుక్కలు పెరుగుతున్నాయి. పట్టణంలో ఎటుచూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. సోమల-నంజంపేట రహదారిలో తిరగాడుతూ పాదచారులపై దాడులు చేస్తున్నాయి. ఈ మార్గంలోనే అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాల ఉండి విద్యార్థులు బడికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు బడివరకు వచ్చి తిరిగి తీసుకెళుతున్నారు. దీంతోపాటు బస్టాండు ప్రాంతంలో కోతుల బెడద ఉంది. దుకాణాల్లో తినుబండారాలు తస్కరించుకొని పోతున్నాయి. తోపుడు బండ్లపై అరటిపండ్లు, ఆపిల్ ఎత్తుకెళ్తున్నాయి. స్థానిక పంచాయతీ పాలక వర్గం వీటి నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

నేడు సదుంలో వైసీపీ నిరసన

సదుం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అరెస్టుకు వ్యతిరేకంగా మండల వైసీపీ శ్రేణులు సోమవారం శాంతియుత నిరసన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు ఎన్.ప్రకాశ్ రెడ్డి తెలిపారు.

వృథాగా డివైడర్ విద్యుత్తు స్తంభాలు



సంపు సమీపంలో పడేసిన విద్యుత్తు స్తంభాలు

పలమనేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని ఎద్దుల సంత వీధిలో ఉన్న మున్సిపల్ తాగునీటి ఫిల్టర్ సంప్ సమీపంలో డివైడర్ల మధ్య విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడానికి వేసే స్తంభాలు గత రెండేళ్లుగా వృథా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరులోని మార్కెట్ యార్డు నుంచి సరస్వతి హోటల్ వరకు జాతీయ రహదారిపై డివైడర్‌పై విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి గుండుబావి వరకు మదనపల్లి రహదారిలో నూ డివైడర్లు ఏర్పాటు చేసి వాటి మధ్యన విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసేందుకు గాను విద్యుత్తు స్తంభాలు తీసుకొచ్చారు. అయితే గత రెండేళ్లుగా ఈ స్తంభాలు వృథాగా పడిఉన్నాయి. ప్రభుత్వం మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తే గాని వీటిని ఏర్పాటు చేయడం కుదరదని ఇక్కడి మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

రాజశేఖర్ దీక్షితులకు శైవాగమ రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న అర్చకులు రాజశేఖర్ దీక్షితులు

చౌడేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు శైవాగమ రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం బెంగళూరులో సువర్ణ కర్ణాటక శైవాగమ బోర్డు ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైవాగమ రత్న అవార్డును స్వీకరించారు. శైవాగమ బోర్డు అధ్యక్షులు మధుసూదనందపురి, గౌరవ అధ్యక్షులు సోమసుందర దీక్షితులు ఆయన్ను శాలువలతో సత్కరించి అభినందించారు. మృత్యుంజయేశ్వరస్వామికి చేస్తున్న సేవలు, భారతీయ సంప్రదాయాలు, పౌరోహిత్యం, వివిధ రంగల్లో చేస్తున్న సేవలను గుర్తించి తనకు శైవాగమ రత్న అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. స్థానిక బజారు వీధిలో వెలసిన అత్యంత పురాతనమైన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులకు అవార్డు రావడంతో ఆయన్ను పలువురు అభినందించారు.

కారు బోల్తా .. నలుగురికి గాయాలు



అదుపుతప్పి బోల్తా పడిన కారు

రొంపిచెర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గా యపడిన సంఘటన రొం పిచెర్ల మండలంలో ఆదివారం జరిగింది. రొంపిచెర్ల క్రాస్‌కు చెందిన యోగేంద్ర, చరణ్, రాజశేఖర్, జశ్వంత్ కారులో రొంపిచెర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడగా... జశ్వంత్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని పీలేరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యుత్తు స్తంభం ధ్వంసం కాగా.. కారు దెబ్బతింది.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు



బాలసుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

కుప్పం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కూనూరు గ్రామంలోని పెరిపల్లం బాలసుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ఆదివారం ఆడికృత్తిక వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి ఉదయమే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకారాలు చేశారు. వేలాదిమంది భక్తులు కావళ్లతో తరలివచ్చి స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేపట్టింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మణి, కనకరాజు, సుందర్, నాగవేలు, గిరి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కరకమందలో కోలాహలంగా సిద్ధ పూజలు



ఎల్లమ్మ దేవత వేషధారితో భక్తులు, నిర్వాహకులు

సోమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమందలో ఎల్లమ్మ దేవత కొలుపు నేపథ్యంలో ఆదివారం సిద్ధ పూజలు కోలాహలంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎల్లమ్మ దేవతను, ఆయుధాలను పల్లకిలో అలంకరించి బాణసంచా వేడుకలతో, కీలుగుర్రాల నడుమ ఊరేగించారు. నడివీధి గంగమ్మకు పూజలు చేశారు. మహిళలు ఇంటింటా మంగళ హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రెండు రోజులుగా ఉపవాస దీక్షలో గ్రామ పొలిమేర్లలో ఉన్న సిద్ధులను ఆలయం వద్దకు తీసుకొచ్చేందుకు ఎల్లమ్మ దేవత వేషధారి, ప్రజలు రాగిమాను బండ వద్దకు తరలివెళ్లారు. సిద్ధులను ఆలయం వద్దకు తీసుకొచ్చి ఉపవాస దీక్షలు విరమింప చేసి వారికి పండ్లు ఫలహారాలు సమర్పించుకున్నారు. సిద్ధులను గ్రామ పురవీధుల్లో ఎల్లమ్మ దేవతతో కలిసి ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులు మూలింటి నారాయణ కుటుంబ సభ్యులను నిర్వాహకులు, గ్రామస్తులు సన్మానించారు.

ఘనంగా పాలేటమ్మ జాతర



నెల్లిమంద జాతరలో పుష్పపల్లకి

సోమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిమంద పాలేటమ్మ జాతర వేడుకలు సందర్భంగా ఆదివారం సిద్ధ పూజలతో ఉత్సవాలు చేపట్టారు. గత వారం రోజులుగా పాలేటమ్మ, పోతురాజు ఉత్సవమూర్తులను ఊరేగించారు. పంచాయతీలోని తెట్టుపల్లె, కమ్మపల్లె, బురుజుపల్లె, బోయపల్లె, చింతలవారిపల్లె, గొల్లపల్లె, కంచెంవారిపల్లె తదితర గ్రామాల్లోని పొలిమేర అమ్మవార్ల ఆలయాల వద్దకు మహిళలు బోణాలు, దీలు ఊరేగింపుగా తీసుకొచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరుగకుండా ఎస్‌ఐ శివశంకర బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ

పుంగనూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి వార్షిక పవిత్రోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి పుణ్యాహవచనం, వాస్తుహోమాలు, ఆకల్మష హోమం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసస్వామి, లక్ష్మీకాంత్ స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో హోమాలు చేస్తున్న అర్చకులు

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



గానుగచింతలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న చల్లా బాబు, ఎమ్మెల్యే జగన్మోహన్

రొంపిచెర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం రొంపిచెర్ల మండలం గానుగచింత, కమ్మపల్లెల్లో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి పర్యటించారు. ఏడాది పాలనలో చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషాద్రినాయుడు, మోహన్‌నాయుడు, కృష్ణమనాయుడు, అమరనాథరెడ్డి, మధుసూదన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల**: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు టీడీపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు.కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ మైనారిటీ నాయకులు జి.ఇమ్రాన్‌ఖాన్, ఎస్.కరీముల్లా, లక్ష్మయ్య, గౌస్‌పీర్‌ఖాన్, రామమూర్తి, నాగరాజ, శ్రీపతి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి ఆలయశుద్ధి



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న శివభక్తులు

బంగారుపాళ్యం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొగిలిలో వెలిసిన స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయాన్ని తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అప్పర్ సన్మార్గ ఉయవార్ పని అరికట్టలై సేవా సంఘానికి చెందిన శివభక్తులు ఆదివారం శుద్ధి చేశారు. ధ్వజస్తంభం, నంది మండపం, లోపలి గోడలు, ఫ్లోరింగ్, కోనేరు చుట్టూ మొలిచిన పిచ్చిమొక్కలతోపాటు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. వీరు శివాలయాల్లో మాత్రమే సేవా కార్యక్రమాలు చేపడతారని ఆలయ అధికారులు తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో ఎ.మునిరాజ, అర్చకులు పాల్గొన్నారు.

చెరువుకట్ట పైనుంచి పడి యువకుడి దుర్మరణం

చిత్తూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్‌పేట చెరువుకట్ట పైనుంచి ద్విచక్రవాహనంసహా కిందపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం పత్రపల్లెకు చెందిన కుప్పుస్వామి కుమారుడు వెంకటేష్ అనంతాపురం కాంప్లెక్స్ వద్ద బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం షాపు తెరవడానికి బీఎన్‌ఆర్‌పేట చెరువుకట్ట మీదుగా వెళ్తున్నాడు. ఆ సమయంలో వాహనం అదుపుతప్పి కట్ట పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి బీఎన్‌ఆర్ పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైటర్ మురళి తెలిపిన వివరాల మేరకు.. వేల్కూరు దళితవాడకు చెందిన కుప్పయ్య (66) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 15వ తేదీన ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

చౌడేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బండ మీదపల్లెకు చెందిన ఓ యువతి (18) రెండు రోజులుగా కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుంగనూరులో మరో యువతి..

పుంగనూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన ఓ యువతి (22) ఈనెల 18 నుంచి కనిపించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

ముగిసిన నృత్య పోటీలు

చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు ఆదివారంతో ముగిశాయి. మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు విజయ సింహారెడ్డి నేతృత్వంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలైన కళాకారులకు బహుమతులను సామాజిక కార్యకర్త పార్థసారథి నాయుడు, లయన్స్‌క్లబ్ సభ్యుడు ఎంపీ శ్రీధర్ రెడ్డి ప్రదానం చేశారు.

మధుర మీనాక్షిగా దేశమ్మ



నగరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌కండ్రిగలోని దేశమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారు మధుర మీనాక్షి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కావళ్ల సమర్పించారు. స్కందపుష్కరిణి వద్ద బాలసుబ్రహ్మణేశ్వర స్వామికి కూడా పూజలు చేశారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి షిరిడీ సాయిబాబా ఆలయంలో చిత్తూరు, తిరుపతి ఎమ్మెల్యేలు జగన్మోహన్, శ్రీనివాసులు ఆదివారం పూజలు చేశారు. అనంతరం ఉచిత షిరిడీ తీర్థయాత్ర వాహనాలను ప్రారంభించారు.

రైతుల సంక్షేమానికే సహకార సంఘాలు

● ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి పీఏసీఎస్ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన భానుప్రకాష్

నగరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు ఉన్నాయని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తుంపు ఉంటుందన్నారు. ఈక్రమంలోనే బాలాజీకి ఛైర్మన్ పదవి, జవహర్‌రెడ్డి, ఐ.వీ.నాయుడికి డైరెక్టర్ల పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాలకు నాయకులు పుష్పాంజలి సమర్పించారు. చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నేతలు రమేష్‌బాబు, కృష్ణారెడ్డి, మీరా,గుణశేఖర్, జ్యోతినాయుడు, సురేష్ నాయుడు, వేణు, శ్రీనివాసులురెడ్డి, దశరథవాసు, కుమార్‌నాయుడు, ఎంవీ శ్రీనివాసులు, నారాయణస్వామి నాయుడు, శివకుమార్‌రెడ్డి, పరంధామనాయుడు, శ్రీనివాసన్, బాబునాయుడు, దూర్వాసులునాయుడు, ధనంజయరాజు పాల్గొన్నారు.

సమయానికి రాని ఆర్టీసీ బస్సు

● ఇబ్బంది పడుతున్న చీలాపల్లెవాసులు



సమస్యలను తెలియజేస్తున్న గ్రామస్తులు

గుడిపాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చీలాపల్లె గ్రామానికి సమయానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఉదయం తొమ్మిది గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు బస్సు సర్వీసు నడిపే వారన్నారు. ప్రస్తుతం వారానికో రోజు కూడా బస్సు రావడం లేదని చెప్పారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి బస్సును సక్రమంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో 'ఆడికృత్తిక'



బూచివానత్తంలో కావళ్లతో వెళుతున్న భక్తులు

విజయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆడి కృత్తిక పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లగుంట, జగన్నాథపురం, విజయపురం, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరం, పాతార్కాడు, ఎల్లసముద్రం, ఆలపాకం, బూచివానత్తం గ్రామాల్లోని భక్తులు కావళ్లతో తిరుత్తణి, రామగిరి సుబ్రహ్మణ్యం స్వామిని దర్శించి మొక్కు చెల్లించారు.

చిత్తూరు కల్చరల్: గిరింపేట చెంగల్‌రాయకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పరిసర ప్రాంతాలనుంచి భక్తులు కావళ్లను స్వామివారికి సమర్పించారు. సాయంత్రం చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లెలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు పద్మనాభ గురుకుల్, ఈవో వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్ పదవితో పెరిగిన బాధ్యత

● కృష్ణమ నాయుడు



కృష్ణమనాయుడు, కోదండరెడ్డిలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఏఎంసీ ఛైర్మన్‌గా తనను నియమించడంతో టీడీపీ పటిష్ఠత పెంచే బాధ్యత మరింత పెరిగిందని ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. చిత్తూరులోని స్వగృహంలో కృష్ణమనాయుడిని, డైరెక్టర్‌గా నియమితులైన కామసాని కోదండరెడ్డిలను ఆదివారం టీడీపీనేతలు సన్మానించారు. బాబునాయుడు, శ్రీధర్‌యాదవ్, దీపక్‌నాయుడు, నెల్లేపల్లె సుబ్రహ్మణ్యం, మునిరాజులు యాదవ్, ప్రసాద్‌నాయుడు, లక్ష్మణ్‌రెడ్డి, లక్ష్మీపతినాయుడు, చంద్రబాబుగౌడ్, రామ్మూర్తినాయుడు, చిరంజీవి, మునస్వామి, విభూషన్, మణి, వడివేలు, శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ



స్థానికులకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని అగరం, అత్తూరు, ఓరూరుపేట పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు రమేష్, కుప్పనాయుడు, గిరిబాబు, విజయ్‌కుమార్‌నాయుడు, పురుషోత్తం నాయుడు, జగదీష్, శివరాజు, గజేంద్రనాయుడు, గురుప్రసాద్, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సమితి ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్ డయాబెటిక్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు డయాబెటిక్, బీపీ, ఈసీజీ, ఐ, డెంటల్ స్క్రీనింగ్ అండ్ ట్రీట్ మెంట్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, కృష్ణమ నాయుడు, జి.శంకర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

● ఇబ్బంది పడుతున్న సిబ్బంది, జనం



పూర్తి కాని సచివాలయ భవన నిర్మాణం

శ్రీరంగరాజపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీనివల్ల ఇటు సిబ్బంది, అటు జనం ఇబ్బంది పడుతున్నారు. ఎస్‌ఆర్ పురం మండల కేంద్రంలో సచివాలయ భవనాన్ని రూ.35 లక్షల ఉపాధి నిధులతో, శెట్టివానత్తంలో రైతు సేవా కేంద్ర భవనాన్ని రూ.17లక్షలతో నిర్మాణం చేపట్టారు. నాలుగేళ్లు దాటినా ఈ భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇంకా 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి ఈ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కత్తెరపల్లె పీహెచ్‌సీని పట్టించుకోరా?

● ఇరుకైన గదులతో రోగులు, వైద్యసిబ్బంది ఇక్కట్లు



కత్తెరపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)న్ని పట్టించుకునేవారు కరువయ్యారు. 2023 సెప్టెంబరు 20వ తేదీన ఇక్కడ పీహెచ్‌సీని మంజూరు చేసి, అందుబాటులో ఉన్న ఇరుకైన గదుల్లో తాత్కాలికంగా ప్రారంభించారు. మూడు నెలల్లో అన్ని వసతులున్న భవన నిర్మాణం చేపట్టి అక్కడికి పీహెచ్‌సీ మారుస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆ ఊసే లేదు. కనీసం స్థల సేకరణ కూడా జరగలేదు. దీనివల్ల రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులు, బాలింతలకైతే మరిన్ని ఇక్కట్లు తప్పడం లేదు. ఇకనైనా పీహెచ్‌సీకి అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పీహెచ్‌సీని తాత్కాలికంగా ప్రారంభించిన భవనంలోనే కొనసాగిస్తున్నాం. సొంత భవన వసతి కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ భువనేశ్వరి, మెడికల్ ఆఫీసర్, కత్తెరపల్లె పీహెచ్‌సీ

సాయిబాబా ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, శ్రీనివాసులు

చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి షిరిడీ సాయిబాబా ఆలయంలో చిత్తూరు, తిరుపతి ఎమ్మెల్యేలు జగన్మోహన్, శ్రీనివాసులు ఆదివారం పూజలు చేశారు. అనంతరం ఉచిత షిరిడీ తీర్థయాత్ర వాహనాలను ప్రారంభించారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా మట్టిదిబ్బలు

● ఇబ్బంది పడుతున్న ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ కాలనీ వాసులు



దారి సమస్యను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

పాలసముద్రం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దారికి అడ్డంగా మట్టిదిబ్బలు వేయడంతో ఎస్‌ఆర్‌ఆర్‌కండ్రిగ కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీలోని 25 మందికి గత ప్రభుత్వ హయాంలో తమిళనాడు సరిహద్దు వద్ద ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. అందులో 16 మంది ఇళ్లు కట్టుకున్నారు. ఈ కాలనీకి వెళ్లే దారి సుమారు వంద అడుగులు తమిళనాడు ప్రభుత్వానికి చెందినది భూమి. ఇపుడీ దారి స్థలం తనదంటూ తమిళనాడులోని అత్తిమంజేరిపేటకు చెందిన ఓ రైతు మూడ్రోజుల కిందట రోడ్డుకు అడ్డంగా గాడితీసి మట్టిదిబ్బలు వేసేశాడు. దీనివల్ల కాలనీకి వెళ్లడానికి దారి సౌకర్యంలేక స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ ఆదివారం సంఘటన స్థలానికి వెళ్లారు. జనసేన నాయకులతో కలసి దారిని ఆక్రమించిన రైతుతో చర్చలు జరిపి, కాలనీవాసులకు ఇబ్బంది కలిగించ వద్దని కోరారు. ఈ సమస్యను ఇరురాష్ట్రాల ప్రభుత్వ అధికారులు దృష్టిసారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు లతీష్‌కుమార్, రూపేష్, మదన్, రమేష్, చందు, కోదండన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



అల్లమడుగులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దిగువపల్లాలు గ్రామ పంచాయతీ గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి రామయ్య అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యమాన్ని ఆదివారం అల్లమడుగులో నిర్వహించారు. ఏడాదిపాలనపై ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్ కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు పి.గోవిందస్వామి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి ఆలయశుద్ధి



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న శివభక్తులు

బంగారుపాళ్యం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొగిలిలో వెలిసిన స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయాన్ని తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అప్పర్ సన్మార్గ్ ఉయవార్ పని అరికట్టలై సేవా సంఘానికి చెందిన శివభక్తులు ఆదివారం శుద్ధి చేశారు. ధ్వజస్తంభం, నందిమండపం, లోపలి గోడలు, ఫ్లోరింగ్, కోనేరు చుట్టూ మొలిచిన పిచ్చిమొక్కలతోపాటు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. వీరు శివాలయాల్లో మాత్రమే సేవా కార్యక్రమాలు చేపడతారని ఆలయ అధికారులు తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో ఎ.మునిరాజ, అర్చకులు పాల్గొన్నారు.

ఏపీపీ శరవణకుమార్‌కు సన్మానం



గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెద్దకాల్వ గ్రామానికి చెందిన సీనియర్ లాయర్ ఎన్.శరవణకుమార్‌ను చిత్తూరు 9వకోర్టు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా రాష్ట్రప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన్ను ఆదివారం స్వగృహం వద్ద టీడీపీ నేతలు సన్మానించారు. కామసాని కోదండరెడ్డి, మునిరాజులుయాదవ్, నెల్లేపల్లె సుబ్రహ్మణ్యం, చంద్రబాబుగౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎట్టేరిలో ఆడికృత్తిక వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోటాగరం పంచాయతీ ఎట్టేరిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలను ఆదివారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 200 మంది భక్తులు కావళ్లను స్వామివారికి సమర్పించారు. భక్తులు తాకిడికి అనుగుణంగా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: జగన్మోహన్

రొంపిచెర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం రొంపిచెర్ల మండలం గానుగచింత, కమ్మపల్లెల్లో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి పర్యటించారు. ఏడాది పాలనలో చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): డీఐ రోడ్డులోని ప్రేమల సినిమా థియేటర్ సమీపంలో ఉన్న ఓ మురుగు కాలువపై బండలు పరిచి ఉన్నారు. ఓ చోట మాత్రం మనిషి కాలువలో పడిపోయేంత మేరకు బండలు లేవు. ఏడాది కాలంగా ఇలాగే ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటికే నగరపాలక పారిశుధ్య సిబ్బంది ఒకరుపడి గాయపడ్డారు. ఓ వృద్ధురాలు పడబోతుండగా స్థానికులు రక్షించారు. ఇటీవల ఓ పశువు ఇందులో పడిపోయింది. దాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో వెలుపలకు తీయాల్సి వచ్చింది. ఇకనైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువుకట్ట పైనుంచి పడి యువకుడి దుర్మరణం



వెంకటేష్ మృతదేహం, పక్కన ద్విచక్రవాహనం

చిత్తూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్‌పేట చెరువుకట్ట పైనుంచి ద్విచక్ర వాహనంసహా కిందపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం పత్రపల్లెకు చెందిన కుప్పస్వామి కుమారుడు వెంకటేష్ అనంతాపురం కాంప్లెక్స్ వద్ద బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం షాపు తెరవడానికి బీఎన్‌ఆర్‌పేట చెరువుకట్ట మీదుగా వెళ్తున్నాడు. ఆ సమయంలో వాహనం అదుపుతప్పి కట్ట పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి బీఎన్‌ఆర్ పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

గంగాధరనెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైటర్ మురళి తెలిపిన వివరాల మేరకు.. వేల్కూరు దళితవాడకు చెందిన కుప్పయ్య (66) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 15వ తేదీన ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కుప్పయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చౌడేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బండ మీదపల్లెకు చెందిన ఓ యువతి (18) రెండు రోజులుగా కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ ట్రాఫిక్ కష్టాలు తప్పేదెన్నడో?



వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ట్రాఫిక్ కష్టాలు ఎక్కువవుతూనే ఉన్నాయి. చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు, అనధికార పార్కింగ్ ఈ సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప నేతృత్వంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోతోంది. ఇకనైనా ఆక్రమణలను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చిగడ్డి దొరక్క పాడి రైతుల ఇక్కట్లు

ఐరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసినా ఎండ వేడిమి తగ్గక పోవడంతో పచ్చిగడ్డి మొలవక పాడి రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు మండలంలో వరి పంట చాలా వరకు తగ్గిపోవడంతో వరిగడ్డి సైతం లభించడం లేదు. పశువులకు ఎండుగడ్డిని వేస్తుంటే పాల శాతం తగ్గిపోతోంది. కొందరైతే ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో అరకొరగా ఉన్న పచ్చిగడ్డిని పశువుల చేత తినిపిస్తున్నారు.





ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో మొలిచిన పచ్చిగడ్డిని తింటున్న ఆవు, దూడ

పశు పోషణ శిబిరాలు ఏర్పాటు చేయాలి



మా పొలంలో పచ్చి గడ్డి వేసుకోవాలన్నా.. బావుల్లో నీరు తగ్గిపోవడంతో వెనుకంజ వేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐరాల మండలంలో పశుపోషణ శిబిరాలను ఏర్పాటు చేయాలి.

- చంద్రశేఖర్, పాడి రైతు

సంక్షిప్తంగా..

నగరపాలక సంస్థ కార్యాలయంలో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు దుకాణాల వేలం

చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీవకారుణ్య అన్నదాన సమాజం మొదటి అంతస్తులోని ఐదు దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో ఈ దుకాణాలను కేటాయిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మధుర మీనాక్షిగా దేశమ్మ



నగరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌కండ్రిగలోని దేశమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారు మధుర మీనాక్షి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు చేశారు.

ముగిసిన నృత్య పోటీలు

చిత్తూరు కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు ఆదివారంతో ముగిశాయి. మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు విజయ సింహారెడ్డి నేతృత్వంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలైన కళాకారులకు బహుమతులను సామాజిక కార్యకర్త పార్థసారథి నాయుడు, లయన్స్‌క్లబ్ సభ్యుడు ఎంవీ శ్రీధర్ రెడ్డి ప్రదానం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



కావళ్లు తీసుకెళ్తున్న భక్తులు

వెదురుకుప్పం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కావళ్లు సమర్పించారు. స్కందపుష్కరిణి వద్ద బాలసుబ్రహ్మణేశ్వర స్వామికి కూడా పూజలు చేశారు.

క్రీడా దుస్తుల వితరణ



బంగారుపాళ్యం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న 15 మంది కబడ్డీ క్రీడాకారులకు వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి వితరణ చేశారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం ఈ దుస్తులను కోచ్ అరవింద్‌బాబు పంపిణీ చేశారు. శివ, శంకరన్, ఉమాపతి పాల్గొన్నారు.

ప్లకార్డులతో వైసీపీ నిరసన

విజయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజాను దూషించడం తగదని పన్నూరు దళితవాడలోని వైఎస్ విగ్రహం ఎదుట మహిళలు, సర్పంచ్ కుమార్ ప్లకార్డులతో ఆదివారం నిరసన తెలిపారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్న మాటలు వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యకర్తలు పాల్గొన్నారు.